

నేడు మంత్రి మనోహర్ రాక



ప్రజాశక్తి - ఏలూరు సిటీ

రాష్ట్ర పౌర సరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ సోమవారం ఏలూరు రానున్నారు. ఆయన ఉదయం తొమ్మిది గంటలకు తెనాలి నుండి కారులో బయల్దేరి 11 గంటలకు ఏలూరు చేరుకుంటారు. ఏలూరు సిఆర్‌రెడ్డి కళాశాల ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ధాన్యం అందించిన రైతులకు సొమ్మును సంబంధిత రైతులకు చెక్కుల ద్వారా పంపిణీ చేస్తారు. అనంతరం మధ్యాహ్నం రెండు గంటలకు ఏలూరు నుండి అమలాపురం బయల్దేరి వెళ్తారు.

భూయజమానులకే బీమా..!


- ప్రభుత్వ నిర్ణయంతో కౌలురైతులకు అన్యాయం
- ఇ-పంటలో భూయజమానుల పేర్లే నమోదు
- కౌలురైతుల పేర్ల నమోదుకు యాజమానుల నుంచి వ్యతిరేకత
- ప్రభుత్వం ప్రత్యేక ఉత్తర్వులిస్తేనే కౌలురైతులకు బీమా ఫలాలు
- వరదలు, భారీ వర్షాల ఇప్పటికే నష్టాలు
- ప్రభుత్వ తీరుపై కౌలురైతుల్లో తీవ్ర ఆవేదన

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

పంటల బీమాపై ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో కౌలురైతులకు తీవ్ర అన్యాయం జరగనుంది. గత ప్రభుత్వం చేసిన తప్పిదాన్ని సరిచేయడం వదిలేసి మళ్లీ అదేవిధంగా బీమా పాలసీ కొనసాగించడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రస్తుత ఖరీఫ్‌కు గత ప్రభుత్వం అమలు చేసిన బీమా విధానాన్నే అమలు చేయడం రైతాంగంలో తీవ్ర చర్చనీయాంశమైంది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో ఖరీఫ్, రబీల్లో దాదాపు ఏడు లక్షలకుపైగా ఎకరాల్లో రైతులు వరిసాగు చేస్తున్నారు. వరదలు, భారీ వర్షాలకు ప్రతియేటా పెద్దఎత్తున పంటలను జిల్లా రైతాంగం నష్టపోతుంది. రెండుజిల్లాల్లో మూడు లక్షల మంది కౌలురైతులు ఉండగా జిల్లా వ్యవసాయ సాగులో 70 శాతానికిపైగా వారే సాగు చేస్తున్నారు. పంట నష్టపోయిన కౌలురైతులకు మాత్రం బీమా పరిహారం అందడం లేదు. గత పాలకులు పంటల బీమాపై అనుసరించిన విధానాలే అందుకు ప్రధాన కారణం. ఇ-పంటలో నమోదైన రైతులకే పంటల బీమా వర్తించేవిధంగా గత ప్రభుత్వం ముందుకు సాగింది. కౌలుచట్టంలో మార్పులు చేసి కౌలురైతులకు కౌలుకార్డులు అందకుండా చేసింది. చట్టంలో భూయజమాని అంగీకారంతోనే కౌలుకార్డులు జారీ చేయాలనే నిబంధన కౌలురైతులకు ఉరితాడుగా మారింది. ఇ-పంటలో భూయజమానుల పేర్లు తప్ప కౌలురైతుల పేర్లు ఎక్కడా నమోదు కావడం లేదు. ఒకవేళ క్షేత్రస్థాయిలో వ్యవసాయాధికారులు నమోదు చేయాలని ప్రయత్నిస్తే భూయజమానుల నుంచి తీవ్ర ప్రతిఘటన ఎదురవుతోంది. దీంతో అధికారులు సైతం ఇ-పంటలో భూయజమానుల పేర్లే నమోదు చేస్తున్నారు. నిబంధనల ప్రకారం సాగు చేస్తున్న రైతుల పేర్లు ఇ-పంటలో నమోదు చేయాలి. అప్పుడే కౌలురైతుల పేర్లు నమోదై ప్రభుత్వం అందించే పంట నష్టపరిహారం, బీమా వంటి సాయం అందుతుంది. అది జరగడం లేదు. దీంతో ఆగ్రహం చెందిన కౌలురైతులు గత ఎన్నికల్లో టిడిపి కూటమికి గంపగుత్తగా ఓట్లు వేశారు. కూటమి ప్రభుత్వం కొత్త బీమా పాలసీ తీసుకొస్తుందని, తమకు న్యాయం జరుగుతుందని కౌలురైతులు ఆశలు పెట్టుకున్నారు. ప్రభుత్వం మాత్రం అందుకు భిన్నంగా ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు గత ప్రభుత్వం అనుసరించిన విధానాన్నే కొనసాగిస్తున్నట్లు ప్రకటించింది. దీంతో కౌలురైతులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు.

ప్రత్యేక ఉత్తర్వులిస్తేనే కౌలురైతులకు న్యాయం..?

ఆరుగాలం శ్రమించి వ్యవసాయ సాగు చేస్తున్న కౌలురైతులకు న్యాయం జరగాలంటే కూటమి ప్రభుత్వం వెంటనే అందుకు సంబంధించిన చర్యలు తీసుకోవాల్సి ఉంది. 2019లో వైసిపి ప్రభుత్వం కౌలుచట్టంలో మార్పులు చేస్తూ భూయజమాని అంగీకారంతోనే కౌలుకార్డులు జారీ అంటూ నిబంధన విధించింది. దీంతో గ్రామాల్లో భూయజమానులు మరింత రెచ్చిపోతున్నారు. చట్టంలో ఆ నిబంధన తొలగిస్తున్నట్లు ప్రభుత్వం వెంటనే ప్రత్యేకంగా ఉత్తర్వులు జారీ చేయాలి. ఆ తర్వాత చట్టంలో మార్పులు చేయాలి. అప్పుడే కౌలురైతులకు న్యాయం జరిగే పరిస్థితి ఉంటుంది. ప్రభుత్వం ప్రత్యేక ఉత్తర్వులు జారీచేస్తే క్షేత్రస్థాయిలో వ్యవసాయ అధికారులు ఇ-పంటలో కౌలురైతులు పేర్లు నమోదు చేస్తారు. అలాకాకుండా కౌలురైతుల పేర్లు నమోదు చేయాలంటూ ఎన్నిమాటలు చెప్పినా క్షేత్రస్థాయిలో భూయజమానులు అందుకు అంగీకరించే పరిస్థితి లేదు. ప్రభుత్వం వెంటనే తగిన ఉత్తర్వులు జారీచేసి ప్రస్తుత ఖరీఫ్‌లో కౌలురైతులకు బీమా అవకాశం ఇవ్వాలని అంతా కోరుతున్నారు. ఇప్పటికే వరదలు, భారీ వర్షాలకు రెండు జిల్లాల్లో 32 వేల ఎకరాల్లో పంటలు దెబ్బతిని కౌలురైతులు తీవ్రంగా నష్టపోయారు. ముందుముందు ఏదైనా నష్టం వాటిల్లినా బీమా నమోదు చేస్తే కౌలురైతులకు అండగా ఉంటుంది.



శిక్షణ, ఉద్యోగావకాశాల కల్పనే లక్ష్యం

జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి గంటా సుధాకర్




ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

త్వరలో ఏలూరు జిల్లాలో స్కిల్ సెన్సెస్ నిర్వహించి పూర్తి డేటా సేకరిస్తామని, దానికి అనుగుణంగా జిల్లాలో యువత, మహిళలు, విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ, ఉద్యోగావకాశాల కల్పనకు పూర్తిస్థాయిలో చర్యలు చేపట్టనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి గంటా సుధాకర్ తెలిపారు. జిల్లాలో నైపుణ్యాభివృద్ధి సంస్థ పనితీరు ఎలా ఉంది, ఏఏ అంశాల్లో యువతకు శిక్షణ ఇస్తున్నారు, విద్యార్థుల్లో నైపుణ్యం పెంపొందించేందుకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు, జాబ్‌మేళాలు సత్ఫలితాలు ఇస్తున్నాయా వంటి పలు ప్రశ్నలకు ఆయన సమాధానాలిచ్చారు.

ప్రశ్న: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఎప్పుడు ఏర్పడింది? దాని లక్ష్యం ఏమిటి?

2014లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ప్రత్యేక మంత్రిత్వశాఖతో ప్రత్యేక శాఖగా ఏర్పడింది. యువతలో నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇవ్వడంతో పాటు ఉద్యోగావకాశాలు కల్పించడం ఈ శాఖ ముఖ్యోద్దేశం.



ప్రశ్న: ఎలాంటి వారికి ఈ నైపుణ్య శిక్షణ ఇస్తారు? జిల్లాలో ఎన్ని ప్రాంతాల్లో ఈ శిక్షణా కేంద్రాలున్నాయి?

ఐటిఐ, జూనియర్, డిగ్రీ కళాశాలలు, వృత్తి విద్యా కేంద్రాలు, నర్సింగ్, డెంటల్ కాలేజీలు తదితర సంస్థల్లో విద్యార్థులను ఎంపిక చేసి ఈ శిక్షణ ఇస్తారు. సాధారణ అకడమిక్ చదువుల వల్ల ఉద్యోగావకాశాలు లభించే పరిస్థితులు తక్కువగా ఉండటం, కంపెనీల్లో పని చేసేందుకు అవసరమైన నైపుణ్యం మన విద్యార్థుల వద్ద లేకపోవడం వల్ల ఈ నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా వారికి ప్రత్యేక శిక్షణ ఇస్తాం. జిల్లాలో ఏడు స్కిల్ హబ్స్, ఒక ఎంప్లాయిబిలిటీ స్కిల్ సెంటర్ ఉన్నాయి.

ప్రశ్న: ఏఏ సంస్థల ద్వారా ఈ శిక్షణ అందిస్తున్నారు?

ముఖ్యంగా బెంగుళూరుకు చెందిన ఉన్నత ఫౌండేషన్‌తో కోఆర్డినేషన్ చేసుకోవడం ద్వారా ప్రస్తుతం నైపుణ్య శిక్షణ జిల్లాలో ఇస్తున్నాం. వారు స్కిల్స్, అర్థమెటిక్, రీజనింగ్ వంటి కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నారు.

ప్రశ్న: ఈ సంవత్సరం ఎన్ని జాబ్‌మేళాలు నిర్వహించారు? ఎంతమందికి ఉద్యోగాలు వచ్చాయి?

2023 మార్చి నుంచి 2024 ఏప్రిల్ వరకు 13 జాబ్‌మేళాలు నిర్వహించగా 5,065 మంది హాజరయ్యారు. వారిలో 2,055 మందికి ఉద్యోగాలు వచ్చాయి.

ప్రశ్న: ఈ నెల 14న నిర్వహించే జాబ్‌మేళాలో ఎంపికైన విద్యార్థులు రూ.50 వేలుపైనే కంపెనీకి చెల్లించాల్సి ఉండగా జీతం సంవత్సరానికి రూ.1.70 లక్షలు మాత్రమే అని ప్రకటించారు. అంటే నెలకు రూ.15 వేలు కూడా రాని నేపథ్యంలో ఈ ఉద్యోగాలు ఎంతవరకు ఉపయోగపడతాయి?

14న హెచ్‌సిఎల్ కంపెనీతో జరిగే కార్యక్రమం ఒక కెరీర్ బిల్డింగ్ ప్రోగ్రాం వంటిది. రూ.1.70 లక్షలు సంవత్సరానికి తక్కువే అయినప్పటికీ ఇంటర్మీడియట్ అర్హతతో ఉద్యోగావకాశాలు కల్పించడం, అది కూడా గణితం సబ్జెక్టు లేకుండా చదివిన వారికి అవకాశాలు కల్పించేలా ప్రోగ్రాం చేపట్టాం. భవిష్యత్తులో జీతం పెరిగే అవకాశం ఉండటమే కాక ఉన్నత చదువులు చదివేందుకు ఆ కంపెనీ అవకాశం కల్పిస్తుంది.

ప్రశ్న: గిరిజన ప్రాంత ప్రజలకు ఉపయోగపడేలా ఏమైనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారా?

ఐటిడిఎతో కోఆర్డినేట్ చేసుకుని ప్రత్యేక అవగాహనా కార్యక్రమాలు గిరిజన ప్రాంతాల్లో నిర్వహిస్తున్నాం. ఆదివాసీల్లో కూడా నైపుణ్యాభివృద్ధి సాధించేందుకు కృషి చేస్తున్నాం.

ప్రశ్న: 'ఏలూరు స్కిల్స్' ప్రోగ్రాం ఏంటి? ఎలాంటి కార్యక్రమాలు చేపట్టబోతున్నారు?

ఏలూరు స్కిల్స్ అనేది ఒక ప్రత్యేక కార్యక్రమం. జిల్లాలో బ్యాంకులు, కంపెనీలు, ఆసుపత్రులు ఎన్ని ఉన్నాయి, ఎలాంటి సేవలందిస్తున్నాయి వంటి డేటాను సేకరించడం ద్వారా, అలాగే ఇండస్ట్రియల్ జనరల్ మేనేజర్, లేబర్ కమిషనర్ ద్వారా కూడా జిల్లాలో ఎన్ని ఫ్యాక్టరీలు, ఎన్ని కంపెనీలు, ఎన్ని ఇండస్ట్రీలు ఉన్నాయి వంటి డేటాను సేకరించి, అక్కడ అందించే సేవలతోపాటు వారికి అవసరమైన నైపుణ్యాలను గుర్తించి వాటిలో యువతకు, విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం ఈ కార్యక్రమ ముఖ్యోద్దేశం.

ప్రశ్న: కేవలం విద్యార్థుల కోసమే కాకుండా మహిళల్లో నైపుణ్యం పెంచి వారు సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ ద్వారా స్థిరపడేందుకు ఎలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు?

మహిళల కోసం ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన ద్వారా టైలరింగ్‌లో శిక్షణ ఇస్తున్నాం. ప్రస్తుతం నూజివీడు, తడికలపూడి, జంగారెడ్డిగూడెంల్లో ఈ శిక్షణ సాగుతోంది.

ప్రశ్న: ఇంకా ఏఏ ప్రాంతాల్లో యువతకు, విద్యార్థులకు ఏఏ రంగాల్లో శిక్షణ ఇస్తున్నారు?

ప్రస్తుతానికి కంప్యూటర్, టైలరింగ్, ఎలక్ట్రీషియన్, సర్వే రంగాల్లో శిక్షణ ఇస్తున్నాం. జంగారెడ్డిగూడెంలోని నాక్ సెంటర్లో టైలరింగ్, ఎలక్ట్రీషియన్, సర్వేల్లో 8 బ్యాచ్‌లు పూర్తయ్యాయి. అలాగే బార్బర్, బుట్టలు అల్లడం, గార్డెనింగ్, బంగారపు పని, ఫుడ్ ప్రాసెసింగ్, హోటల్ మేనేజ్‌మెంట్, బేవరేజెస్ వంటి రంగాల్లో శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం.

ప్రశ్న: నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా శిక్షణ, రుణాలిప్పించి, స్వయం ఉపాధి కోసం ఇండస్ట్రీలు పెట్టించే ఆలోచన ఏమైనా ఉందా?

మొక్కజొన్న విత్తనాలతో క్యారీబ్యాగ్స్ తయారు చేయడంపై డిఆర్‌డిఒ సైంటిస్ట్ ఒకరు సక్సెసయ్యారు. ఆయన ద్వారా శిక్షణ ఇప్పించి ఆ టెక్నాలజీతో క్యారీబ్యాగ్స్ తయారు చేసే యూనిట్లు జిల్లాలో స్థాపించాలని అనుకుంటున్నాం. అయితే యూనిట్‌కు రూ.30 లక్షల వరకు పెట్టుబడి అవుతుంది. ఈ విషయంపై ఉన్నతాధికారులతో మాట్లాడి నిర్ణయం తీసుకోవాలి.

ప్రశ్న: స్కిల్ డెవలప్‌మెంట్, ఇంటర్న్‌షిప్ పేరుతో విద్యార్థులను చదువు మధ్యలో మూడు నెలలు, ఆరు నెలల కోర్సులు అంటూ బయటకు పంపిస్తుంటే వారు ఒక గంట శిక్షణ తీసుకుని, మిగిలిన టైం వథా చేస్తూ అటు చదువుకి, ఇటు ఉద్యోగానికి దేనికి పనికిరాకుండా పోతున్నారు అనే మాట ఈమధ్య ఎక్కువగా విన్పిస్తోంది. దీనిపై మీరేమంటారు?

హయ్యర్ ఎడ్యుకేషన్‌లో డిగ్రీ విద్యార్థులను ఇంటర్న్‌షిప్ పేరుతో బయటకు పంపిస్తున్నారు. అకడమిక్ చదువులే కాకుండా వివిధ కంపెనీల్లో పని చేసే నైపుణ్యం ఉండాలనేది దీని ముఖ్యోద్దేశం. సమయం వృథా కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉంది.

ప్రశ్న: చివరగా యువతకు, విద్యార్థులకు మీరిచ్చే సూచన ఏమిటి?

రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా యువత, విద్యార్థుల్లో నైపుణ్యాన్ని పెంచి వారికి ఉద్యోగావకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టింది. విద్యార్థులు, యువత వీటి గురించి ఎప్పటికప్పుడు తెలుసుకుని, తగిన అవకాశాలను అందిపుచ్చుకుని, ఉన్నత స్థాయికి ఎదిగేందుకు కృషి చేయాలి.


కాంటూర్‌తో సంబంధం లేకుండా పరిహారం ఇవ్వండి

పోలవరం నిర్వాసితుల సమస్యలపై మంత్రి నిమ్మలకు సిపిఎం వినతి

త్వరితగతిన సమస్యలు పరిష్కరిస్తాం: మంత్రి నిమ్మల హామీ

ప్రజాశక్తి - కుక్కునూరు రూరల్

2013 భూసేకరణ చట్టప్రకారం నిర్వాసితులకు పరిహారం ఇచ్చిన తర్వాతే పోలవరం ప్రాజెక్టు పనులు చేపట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి అన్నారు. శనివారం పాలకొల్లులో జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుతో సిపిఎం బృందం నిర్వాసితుల సమస్యలపై సుమారు గంటన్నరపాటు చర్చించిందని తెలిపారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని మంత్రికి అందజేశామని వివరించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ నిర్వాసితుల త్యాగాల పునాదులపై పోలవరం ప్రాజెక్టు నిర్మిస్తున్నామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటిస్తూనే ఉన్నాయన్నారు. అయితే ప్రాజెక్టు నిర్మాణంలో ఉన్న శ్రద్ధ నిర్వాసితులకు పునరావాసం కల్పించడంలో లేదని అన్నారు. ఫలితంగా ఈ 15 ఏళ్లలో ప్రాజెక్టు నిర్మాణం 75 శాతానికిపైగా పూర్తవ్వగా పునరావాస కల్పన 10 శాతం కూడా మించలేదన్నారు. పునరావాసం కల్పించిన వారికి సైతం అరకొరగానే సాగిందన్నారు. పోలవరం ప్రాజెక్టులో ముంపునకు గురయ్యే ప్రాంతాలను ప్రభుత్వాలు అశాస్త్రీయంగా గుర్తించాయని, 2022 జులైలో వచ్చిన వరదల్లో 41.5 కాంటూరుకు పైబడిన గ్రామాలు సైతం మునిగిపోయాయని గుర్తు చేశారు. జిల్లాలో పోలవరం, కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని 25 వేల కుటుంబాలు, లక్ష మంది నిర్వాసితులవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వీరిలో అత్యధికులు గిరిజనులేనని, వీరికి పోలవరం, బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం మండలాల్లో పునరావాస కాలనీలు నిర్మించారని తెలిపారు. అక్కడ సమస్యలు కోకొల్లలుగా ఉన్నాయన్నారు. ఒక్క కుటుంబానికి కూడా పూర్తిస్థాయిలో పునరావాసం కల్పించలేదని, నూతన ప్రభుత్వం స్పందించి పునరావాస కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. పంచాయతీలకు కాలనీలు అప్పగించి వాటికి అవసరమైన నిధులు కేటాయించాలన్నారు. కుక్కునూరు, వేలేరుపాడు మండలాల నుండి తరలించిన నిర్వాసితులకు ఆ గ్రామ పరిధిలోకి బ్యాంక్, ఇతర సేవలు మార్చాలని, 2013 భూసేకరణ చట్ట ప్రకారం ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ తక్షణమే ఇవ్వాలని, గత ప్రభుత్వం ఇచ్చిన హామీ రూ.10 లక్షలు చెల్లించాలని, 2022 ముంపు ఆధారంగా కుక్కునూరు, వేలేరుపాడు మండలాలకు పరిహారం చెల్లించాలని, కాంటూర్‌తో సంబంధం లేకుండా పునరావాస కాలనీలకు తరలించి అలాట్‌మెంట్ ఆర్డర్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ నిర్వాసితుల గ్రామాల్లో వరదల సమయంలో పర్యటించామని, నిర్వాసితులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. వీలైనంత త్వరగా నిర్వాసితులకు న్యాయమైన పరిహారం ఇచ్చి సమస్యలు పరిష్కరించేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం, కుక్కునూరు, జంగారెడ్డిగూడెం మండల కార్యదర్శులు యర్రంశెట్టి నాగేంద్రరావు, మానుకొండ జీవరత్నం, నేత యర్నం సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.


మంత్రి నిమ్మలకు వినతిపత్రం అందిస్తున్న సిపిఎం నేతలు

రైతుల సంక్షేమానికి కృషి : ఎంపీ మహేష్‌కుమార్

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్‌ను ఏలూరులోని ఆయన కార్యాలయంలో జిల్లాలోని పొగాకు రైతులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఇటీవల జరిగిన పార్లమెంట్ సమావేశాల్లో తమ మేలు చేకూరేలా తమ సమస్యల పట్ల కేంద్ర మంత్రులతో మాట్లాడినందుకు ఈ సన్మానం చేస్తున్నామని పొగాకు రైతులు చెప్పారు. ఈ సందర్భంగా ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో తాను ఏ విధంగా రైతులకు హామీ ఇచ్చానో ఆ హామీ మేరకు రైతులకు మేలు చేకూరే ఏ పని అయినా చేస్తానని హామీ ఇచ్చారు. రైతులు బాగుంటేనే రాష్ట్రం, దేశం బాగుంటుందన్నారు. అనంతరం పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ప్రజలు అందించిన వినతిపత్రాలు తీసుకున్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎంపి చెప్పారు. త్వరలో పామాయిల్ రైతులకు మేలు చేకూరేవిధంగా కేంద్ర మంత్రులతో మాట్లాడి సరైన గిట్టుబాటు ధర లభించేలా ప్రయత్నిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ పుట్టా మహేష్‌కుమార్

పామాయిల్ రైతులకు గిట్టుబాటు ధర కల్పనకు సూత్ర ప్రతిపాదిక

చింతలపూడి :పామాయిల్ రైతులకు రూ.16,700 గిట్టుబాటు ధర నిర్ణయించేందుకు ప్రభుత్వం తగు సూత్ర ప్రతిపాదికను సిద్ధం చేస్తుందని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ తెలిపారు. ఎంపీ మహేష్‌ను ఆయన నివాసంలో నామవరం పంచాయతీ పట్టాయగూడెం టిడిపి ముఖ్య నేత గోపీబాబు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి పామాయిల్ రైతులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి క్షుణ్ణంగా వివరించారు. పామాయిల్ రైతులకు గిట్టుబాటు ధర అందించాలని గోపీబాబు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఎంపీ మహేష్ మాట్లాడుతూ కేంద్ర వాణిజ్య కార్యదర్శి సునీల్ భర్త్వల్‌తో ఈ విషయంపై ప్రధానమంత్రి ముందు చర్చించానని, రైతులకు గిట్టుబాటు ధరను రూ.16,700 నిర్ణయించేందుకు ప్రభుత్వం తగు సూత్ర ప్రతిపాదికను సిద్ధం చేస్తుందని తెలిపారు.


కోతకు గురైన ఫెర్రీరేవు పరిశీలిస్తున్న నాయకులు

కోతకు గురైన పట్టిసీమ ఫెర్రీరేవు పరిశీలన

ప్రజాశక్తి - పోలవరం

పట్టిసీమ అవుట్ ఫాల్ స్లూయిజ్ నుంచి గోదావరిలోకి విడుదలవుతున్న కొండవాగులు, కొవ్వాడ కాలువ జలాల తాకిడికి ప్రమాద స్థాయిలో కోతకు గురైన పట్టిసీమ ఫెర్రీ రేవును జనసేన జిల్లా నాయకులు కరాటం రాంబాబు, కూటమి పోలవరం మండల నాయకులు ఆదివారం పరిశీలించారు. స్లూయిజ్‌కి రిటైనింగ్ వాల్ నిర్మాణం చేసేలా చర్యలు తీసుకోవాలని స్థానిక నాయకులు కరాటం రాంబాబును కోరారు. ప్రతిఏటా కొవ్వాడ కాలువ వర దలతో ఇబ్బందులకు గురవుతున్న రైతుల ఇబ్బం దుల తొలగించేందుకు అప్పట్లో కరాటం రాంబాబు చొరవ చూపి పట్టిసీమ అవుట్‌ఫాల్ స్లూయిజ్ నిర్మించారని స్థానిక రైతులు అన్నారు. పట్టిసీమ ఫెర్రీ రేవును పరిశీలించినవారిలో టిడిపి సీనియర్ నాయకులు కుంచే దొరబాబు, పాపోలు రత్తయ్య, జనసేన నాయ కులు కొణతాల ప్రసాద్, మొగల్ల హరిబాబు, చెంచాని రత్నప్రసాద్, వారాడి సత్తిబాబు, అమరాన్ పోసిబాబు, బిజెపి నాయకులు నాగరాజు పాల్గొన్నారు.

నేడు 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ'

ప్రజాశక్తి - ఏలూరు

ఈ నెల 12వ తేదీ సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం కలెక్టరు కార్యాలయంలోని గోదావరి సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ వెట్రిసెల్వి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉదయం పది గంటల నుంచి నిర్వహించనున్నట్లు తెలిపారు.

సర్దుబాటు సరైనదేనా..!

గత ప్రభుత్వ విధానాలే అమలు అని సర్వత్రా విమర్శ

ప్రజాశక్తి - మండవల్లి

ఉపాధ్యాయులు తేనె తుట్టు లాంటివారని, వారిని కదిలిస్తే ఇబ్బందులే అని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉపాధ్యాయుల గురించి వ్యాఖ్యలు చేశారు. ఆంధ్ర రాష్ట్రంలో విద్యా సంవత్సరం ప్రారంభమై టిడిపి కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు నెలల గడుస్తున్నా విద్యాశాఖ విషయంలో స్పష్టమైన వైఖరిని తెలపడం లేదు. గత ప్రభుత్వం ఉపాధ్యాయుల పట్ల విద్యా వ్యవస్థలో తీసుకున్న నిర్ణయాలతో ప్రభుత్వ విద్యా రంగం అతలాకుతులమైంది. నాటి విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్‌ప్రకాష్ చేసిన ప్రకటనలు, జిఒ 117లో తలెత్తిన సమస్యలతో ఉపాధ్యాయులు 85 శాతం పైగానే బహిరంగంగానే కూటమికి మద్దతు పలికారు. టిడిపి కూటమి ప్రభుత్వంపై ఉపాధ్యాయులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. అయితే ప్రభుత్వ సర్దుబాటు నిర్ణయం ఉపాధ్యాయులను ఆందోళనకు గురి చేస్తుంది. బదిలీల హేతుబద్ధీ కరణ జరిగి కేవలం సంవత్సర కాలమే పూర్తి కావడం, గత ప్రభుత్వం అమలు చేసిన జిఒ 117, 128లనే అమలుపరుస్తూ సర్దుబాటు అనే తేనెతుట్టును కదిపింది అనే విమర్శలు ఉన్నాయి.

జిఒ 117 రద్దు లేనట్లేనా

యువగళం పాదయాత్రలో భాగంగా ప్రస్తుత విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చిన వెంటనే జిఒ 117ను రద్దు చేస్తామని స్పష్టమైన ప్రకటన చేశారు. జిఒ 117 రద్దు అయిపోతుందని ఉపాధ్యాయులు, సంఘాలు కోటి ఆశలతో ఎదురుచూ స్తున్నారు. ఫ్రెండ్లీ ప్రభుత్వం అని చెప్పి టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చి రెండు నెలలు గడుస్తున్నా జిఒ 117ను రద్దు పరిచే విధంగా ఉపాధ్యాయ సంఘాల నేతలతో సమావేశం కూడా ఏర్పాటు చేయలేదు. దీంతో టిడిపి కూటమి ప్రభుత్వం కూడా గత ప్రభ ుత్వ విధానాల్లోనే వెళ్తుందని ఉపాధ్యాయుల్లో చర్చ మొదలైంది.

మెగా డిఎస్‌సి సాధ్యమేనా

జనవరి నుంచి జులై ఆఖరు వరకు ఉద్యోగోన్నతి పొందిన ఉపాధ్యాయుల స్థానాల్లో ఎస్‌జిటిలకు ఉద్యోగోన్నతులు కల్పిస్తేనే మెగా డిఎస్‌సి-2024కు మార్గం సులువవుతుందని, ఉపాధ్యాయ ఖాళీలు అందుబాటులోకి వస్తాయని విద్యా నిపుణులు తెలుపుతున్నారు. ఇప్పటికైనా సర్దుబాటు కొంతకాలం పక్కన పెట్టి ఉద్యోగోన్నతులు కల్పిస్తే మంచిదనే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.

జిఒ 117 రద్దు చేయాలి

చిరిగిరి పిచ్చేడు, యుటిఎఫ్ జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు



ఎన్నికల్లో ఇచ్చిన హామీలో భాగంగా జిఒ117ను వెంటనే రద్దుచేసి ప్రభుత్వ పాఠశాలలను బతికించాలి. అలాగే సర్దుబాటు పేరుతో ఉపాధ్యాయులను ఇబ్బందులకు గురిచేయడం సరికాదు.

ఉద్యోగోన్నతులు చేపట్టాలి

జి.రవికుమార్, ఉపాధ్యాయులు



అసెంబ్లీ సాక్షిగా విద్యాశాఖ మంత్రి ప్రకటించిన రీతిగా 6,420 మంది ఉపాధ్యాయులకు ఉద్యోగోన్నతి కల్పించాలి. సంవత్సర కాలంగా నిలిచిపోయిన ఉద్యోగోన్నతులను వెంటనే చేపట్టాలి.

కమ్యూనిటీ హాలు నిర్మిస్తాం

రాజీవనగర్ వాసులకు ఎంఎల్ఎ బాలరాజు హామీ

ప్రజాశక్తి - బుట్టాయగూడెం


బుట్టాయగూడెం రాజీవ్‌నగర్ కాలనీలో కమ్యూనిటీ హాలు నిర్మాణానికి త్వరలోనే నిధులు మంజూరు చేస్తామని ఎంఎల్ఎ చిర్రి బాలరాజు హామీ ఇచ్చారు. ఆయన ఆదివారం స్థానికంగా ఒక ప్రయివేటు కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి అందుగులు ఫ్రాన్సిస్, రాజీవ్‌నగర్ కాలనీవాసులు ఎంఎల్ఎను కలిసి తమకు కమ్యూనిటీ హాలు లేకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. గత పదేళ్లుగా ఈ సమస్యపై ఎంఎల్ఎలకు వినతిపత్రాలు ఇస్తున్నా పట్టించుకున్న దాఖలాల్లేవని వాపోయారు. దీనిపై ఎంఎల్ఎ బాలరాజు మాట్లాడుతూ రాజీవ్‌నగర్ కాలనీకి ఎంపీ, ఎంఎల్ఎ గ్రాంట్ల నుంచి త్వరలోనే కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులు కేటాయించడమే కాక పనులు పూర్తి చేసి తామే ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు.

మానస పూర్వ విద్యార్థులకు ర్యాంకులు అభినందనీయం

ఆ పాఠశాల కరస్పాండెంట్ యలమర్తి రవీంద్రకుమార్

ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలు మానస ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు జాతీయస్థాయిలో నిర్వహించిన వివిధ పోటీ పరీక్షల్లో ర్యాంకులు సాధిం చడం అభినందనీ యమని ఆ పాఠశాల కరస్పాండెంట్ యలమర్తి రవీంద్రకుమార్ అన్నారు. ప్రస్తుత సంవత్సరం పాఠశాల పూర్వ విద్యార్థులైన గండి వినయ్‌వర్మ ఐఐటిలో సీటును సాధించారు. ఇదేవిధంగా జాతీయస్థాయిలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన నిట్ పరీక్షల్లో ఉన్నతస్థాయి ర్యాంకు సాధించిన కె.వంశీకృష్ణ వరంగల్ నిట్‌లో సీటు సాధించారు. ఈ సందర్భంగా తనను కలిసిన వంశీకృష్ణను పాఠశాల కరస్పాండెంట్ రవీంద్రకుమార్ అభినందించారు. వంశీకృష్ణ మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని అభిలాషించారు. వంశీకృష్ణ ఉన్నత స్థానానికి చేరటానికి సహకరించిన వారి తల్లిదండ్రులను, విద్యాబోధనలో సహకరించిన పాఠశాల ఉపాధ్యాయులను అభినందించారు.


వంశీకృష్ణను అభినందిస్తున్న రవీంద్రకుమార్

తగ్గిన గోదావరి నీటిమట్టం

స్పిల్ వే నుంచి 5,24,615 క్యూసెక్కుల నీరు విడుదల

ప్రజాశక్తి - పోలవరం

పోలవరంలో గోదావరి నీటి మట్టం ఆదివారం నాటికి గణనీయంగా తగ్గింది. పోల వరం ప్రాజెక్టు స్పిల్ వే నుంచి 5,24,615 క్యూసెక్కుల నీటిని ప్రాజెక్టు అధికారులు దిగువకు విడుదల చేశారు. ప్రాజెక్టు స్పిల్ వే ఎగువన 30.240 మీటర్లు, దిగువన 21.230 మీటర్ల నీటిమట్టం నమోదైనట్లు ఇఇలు పి.వెంకటరమణ, మల్లికార్జునరావు తెలిపారు.

రేషన్‌బియ్యంలో పురుగులు..!

ప్రజాశక్తి - చింతలపూడి

మండలంలోని మెతుకుమెల్లివారిగూడెంలో ఆదివారం ఉదయం రేషన్ బియ్యం పంపిణీ చేయగా సగానికి సగం పైగా పురుగులు ఉన్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై రేషన్ బియ్యం పంపిణీ చేసే సిబ్బందిని అడగగా 'మాకు పైనుంచి ఇలాగే వచ్చాయని మేము ఇలాగే పంపిణీ చేస్తున్నాం' అని చెప్పినట్లు గ్రామస్తులు వాపోతున్నారు. దీనిపై సివిల్ సప్లై డిటిని వివరణ అడగగా ఈ విషయం తమ దృష్టికి రాలేదని, పూర్తిగా తెలుసుకుంటానని చెప్పారు.



రేషన్‌బియ్యంలో ఉన్న పురుగులు

లక్ష్మక్క మృతి తీరని లోటు

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలోని మర్రిగూడెం ప్రాంతంలో భూపోరాటాల్లో ముఖ్య పాత్ర పోషించిన రైతు కూలీ సంఘం నాయకురాలు లక్ష్మక్క మృతి ఆ సంఘానికి తీరని లోటని జిల్లా నాయకులు అన్నారు. మర్రిగూడెంలో అనారోగ్యంతో మృతి చెందిన లక్ష్మక్కకు సంఘం నాయకులు ఆదివారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1990 కాలంలో ఆనాటి భూ పోరాటల్లో భాగంగా ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం సారధ్యంలో భూస్వాములకు పెత్తందారులకు వ్యతిరేకంగా సాగిన పోరాటంలో ఎందరో తమ ప్రాణాలను పణంగా పెట్టి ఆదివాసీ గిరిజనుల హక్కుల కోసం ఎన్నో పోరాటాలు చేశారన్నారు. ఆనాడు ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం నాయకత్వంలో పెద్ద ఎత్తున భూ పోరాటాల జరిగాయన్నారు. ఆ పోరాట ఫలితంగా నేడు మర్రిగూడెం ప్రాంతంలో ఉన్న ఆరు గ్రామాల గిరిజనులు సాధించుకున్న భూముల్లో సాగు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారన్నారు. ఈ పోరాటాల్లో మర్రిగూడెం ప్రాంతానికి చెందిన లక్ష్మక్క పోరాటం ఎంతో కీలకమన్నారు. ఎన్నో ఇబ్బందులు ఎదురైనా కేసులను జయించి, ప్రాణాలకు తెగించి పోరాడిన వ్యక్తి లక్ష్మక్క అని కొనియాడారు. ఆమె మృతి చాలా బాధాకరమని, రైతు కూలీ సంఘానికి తీరని లోటన్నారు. లక్ష్మక్క మృతికి ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం జిల్లా కమిటీ తరపున విప్లవ జోహార్లు తెలియజేస్తూ ఆమె కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నామన్నారు. లక్ష్మక్క ఆశయాలు కొనసాగిస్తామని, రైతు కూలి సంఘం నాయకత్వంలో పోరాటం కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు కొండ రాము, జంగారెడ్డిగూడెం డివిజన్ కార్యదర్శి బత్తుల బాబూరావు, సంఘం నాయకులు చుట్టి నాగేశ్వరరావు, గడ్డం కాటయ్య, కనకయ్య పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు అన్నారు. మండలంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1980–1983 సంవత్సరకాల పూర్వ విద్యార్థుల సహకారంతో ఏర్పాటు చేసిన సరస్వతి దేవి విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. పూర్వ విద్యార్థులకు ఆహ్వానం మేరకు కార్యక్రమానికి ఎంఎల్ఎ చిర్రి బాలరాజు హాజరై సరస్వతి దేవి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య అనేది ముఖ్యంగా రెండు రకాలగా అవసరం ఉంటుందన్నారు. జీవనోపాధి ఎలా కల్పించుకోవాలో నేర్పేది, ఎలా జీవించాలో నేర్పించేది విద్య అని చెప్పారు. అనంతరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజును కళాశాల సిబ్బంది, పూర్వ విద్యార్థులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో విగ్రహ శిల్పి శ్రీనివాస్, స్థలదాత కొల్లూరి రవీంద్ర, ఎంఎల్ఎ చిర్రి బాలరాజు, జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి కరాటం సాయి, మండలాధ్యక్షులు తోట రవి, పట్టణ అధ్యక్షులు మాదేపల్లి శ్రీనివాస్, టిడిపి మండలాధ్యక్షులు పారేపల్లి నరేష్, బిజెపి జిల్లా మోర్చా నిర్మల కిషోర్ పాల్గొన్నారు.

గ్రామీణులకు ఉచిత కంటి వైద్య శిబిరాలు దోహదం

ప్రజాశక్తి - టి.నర్సాపురం

మండలంలోని బొర్రంపాలెం గ్రామంలో ఫర్ ద పీపుల్ యూత్ ఆధ్వర్యంలో ఆదివారం గ్రామంలోని ఎంపిపి పాఠశాల ఆవరణలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరానికి నిడదవోలు కంటి వైద్య నిపుణులు రాజేశ్వరి, రామకృష్ణ లయన్స్ నేత్ర వైద్యశాల సిబ్బంది సుమారు వందకు పైగా కంటి సమస్యతో బాధపడుతున్న వారికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో 20 మందికి పైగా ఆపరేషన్లు అవసరమని వైద్యులు తెలిపారు. వారికి ఉచితంగా ఆపరేషన్లు చేస్తామని వైద్యులు చెప్పారు. ఈ సందర్భంగా ఫర్ ద పీపుల్ యూత్ ఆర్గనైజర్ కలపర్తి విజయ్ మాట్లాడుతూ యూత్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని మెడికల్ క్యాంపులు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెళ్ల మోషే, గుండె ప్రవీణ్‌కుమార్, రవి, గాంధీ, వీర్రాజు, సురేష్, మోషే పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం మహాత్మాగాంధీ వృద్ధాశ్రమంలో ఆదివారం పోలవరం పాత్రికేయులు లంక సూర్య అప్పాజీ అన్నదానం నిర్వహించారు. తన కుమారుడు విజయ్ నాగవేదాన్స్ పుట్టినరోజు సందర్భంగా వృద్ధాశ్రమంలో కుటుంబ సభ్యులతో కలిసి వృద్ధులకు అన్నదానం నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఈ అన్నదాన కార్యక్రమంలో టిడిపి నాయకులు వాడవల్లి నాగరాజు, షెహిన్షా బాషా, లంక అన్నపూర్ణ, సత్యవతి, చెందాని బుజ్జి పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

సత్ప్రవర్తనతో మెలగకపోతే కఠినమైన చర్యలు తప్పవని పట్టణ ఎస్ఐ డి.రామకృష్ణ హెచ్చరించారు. నూజివీడు పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణలో సిఐ ఎంవిఎస్ఎన్.మూర్తి పర్యవేక్షణలో రౌడీషీటర్లకు ఎస్ఐ రామకృష్ణ ఆదివారం కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గొడవలకు దూరంగా ఉండాలన్నారు.

నేరాలు - ఘోరాలు

షార్ట్ సర్క్యూట్‌తో తాటాకిల్లు దగ్ధం

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో తాటాకిల్లు దగ్ధమైన ఘటన మండలంలోని కనకాపురంలో ఆదివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన శొంఠి రాముకు చెందిన ఇంట్లో ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. వెంటనే స్థానికుల సహాయంతో మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో ఇంట్లో ఉన్న వారు అప్రమత్తం అవడంతో ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు. కొంత నగదు, బట్టలు కాలి బూడిదయ్యాయని బాధితులు వాపోతున్నారు.

పేకాట స్థావరంపై దాడి

ప్రజాశక్తి - కామవరపుకోట

పేకాటాడుతున్న ఐదుగురిని పోలీసులు అరెస్టు చేశారు. తడికలపూడి ఎస్ఐ ఎం.జయబాబు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని కామవరపుకోట గ్రామ పంచాయతీలోని వడ్లపల్లి శివారులో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు ఆదివారం ఎస్ఐ తన సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడిలో ఐదుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.6,950 నగదు, ఏడు మోటర్ సైకిళ్లు, 52 పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

కోళ్ల వ్యర్థాల వాహనం పట్టివేత

ప్రజాశక్తి - భీమడోలు

కోళ్ల వ్యర్థాలను చేపల మేతగా తరలిస్తున్న ఒక వాహనాన్ని జాతీయ రహదారిపై సూరప్పగూడెం వద్ద పోలీసులు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. భీమడోలు ఎస్ఐ సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం... ఏలూరు మండలం కొక్కిరాల లంక గ్రామానికి చెందిన ఘంటసాల శేషుబాబు తన వాహనంలో డ్రైవర్ దొంగల రాజేష్ సహకారంతో పోతవరం గ్రామంలో సేకరించిన కోళ్ల వ్యర్థాలను చేపల మేతగా తరలిస్తున్నట్టు ముందస్తు సమాచారం భీమడోలు పోలీసులకు చేరింది. ఈ మేరకు అప్రమత్తమైన పోలీసులు సూరప్పగూడెం వద్ద నిర్వహించిన తనిఖీల్లో ఆ వాహనాన్ని పట్టుకున్నారు.

కార్పొ 'రేటు' విద్యాసంస్థలు

అధిక ఫీజులు వసూలు

యూనిఫామ్స్, పాఠ్య, నోటు పుస్తకాలు పాఠశాలల్లో కొనాల్సిందే

లబోదిబోమంటున్న తల్లిదండ్రులు



ప్రజాశక్తి- ముదినేపల్లి

ప్రయివేట్ విద్యాసంస్థలు విద్యార్థుల తల్లిదండ్రులకు చుక్కలు చూపిస్తున్నాయి. యూనిఫామ్ నుంచి పాఠ్య, నోటు పుస్తకాల వరకు తమ వద్దనే కొనుగోలు చేయాలని హుకుం జారీ చేస్తున్నారు. ఆయా ప్రయివేట్ పాఠశాలల యాజమాన్యం చెప్పిన ధరకే కొనుగోలు చేయాల్సిన పరిస్థితి విద్యార్థుల తల్లిదండ్రుల్లో నెలకొంది. దీంతో అధిక ఫీజులు కట్టలేక, అధిక ధరలకు పుస్తకాలు, యూనిఫాంలు కొనుగోలు చేయలేక విద్యార్థుల తల్లిదండ్రులు లబోదిబోమంటున్నారు. అంతేకాకుండా అడ్మిషన్ల వ్యవహారంలోనూ మరింత దోపిడీ చేస్తున్నట్లుగా విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. పలు పాఠశాలల్లో అడ్మిషన్ల సమయంలో విద్యార్థులకు టెస్ట్ పెట్టి 80 శాతం మార్కులు వచ్చిన విద్యార్థికి ఒక విధంగా, అంతకన్నా తక్కువ శాతం మార్కులు వచ్చిన విద్యార్థికి మరింత భారమైన ఫీజులను కట్టించుకుంటున్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల బలహీనతను లక్ష్యంగా చేసుకొని ఫీజుల రూపంలో వారి రక్తాన్ని పిండుతున్నారు. మండలంలోని పలు విద్యా సంస్థల్లో స్కూలు యూనిఫాంలు తమ వద్ద కొనుగోలు చేయాలని హుకుం జారీ చేస్తున్నారు. అలాగే స్కూల్ డైరీ, కాపీలు, కంప్యూటర్ బుక్స్ అంటూ అధిక మొత్తంలో సొమ్ము వసూలు చేస్తున్నారు. ఇవి కాకుండా పాఠ్య, నోటు పుస్తకాలు తమ వద్దనే తీసుకోవాలంటూ డిమాండ్ చేస్తూ అధిక ధరలకు విక్రయిస్తున్నారు. దీంతో ఏం చేయాలో పాలుపోని విద్యార్థులు తప్పనిసరి పరిస్థితుల్లో అధిక ధరలు చెల్లించి బుక్స్, యూనిఫాం కొనుగోలు చేస్తున్నారు. తాము పడ్డ కష్టం తమ పిల్లలు పడకూడదనే లక్ష్యంతో విద్యార్థుల తల్లిదండ్రులు కూలి, నాలి చేసి తమ పిల్లలను ప్రయివేట్ విద్యాసంస్థల్లో మంచి చదువు చదివించాలనే లక్ష్యంతో కష్టపడి చదివిస్తున్నారు. ఇటువంటి పేదవారికి స్కూల్ యాజమాన్యాలు నిర్దేశించే ఫీజులు పెనుభారంగా మారుతున్నాయి. స్కూలు ఫీజులు కూడా ప్రతి ఏటా పెంచుకుంటుపోతున్నారు. ఇదేమని ప్రశ్నించలేని పరిస్థితుల్లో విద్యార్థుల తల్లిదండ్రులు ఉన్నారు. పరీక్ష ఫీజు కట్టలేని పేదవారు ఎవరైనా ఉంటే ఆ విద్యార్థి చేత పరీక్ష రాయనివ్వరు. దీంతో పేదలైన తల్లిదండ్రులు అప్పులు చేసి ఫీజులు కట్టి తమ పిల్లలను పరీక్షకు పంపే పరిస్థితులు ఉన్నాయి. పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులకు స్కూల్ యాజమాన్యాలు తక్కువ జీతం ఇస్తూ వారిచేత వెట్టి చాకిరీ చేయించుకుంటున్నట్లు ఆరోపణలు వినవస్తున్నాయి.

మండలంలో ఎనిమిది ప్రయివేట్ పాఠశాలలు ఉన్నాయి. ఒక్కో పాఠశాలలో ఒకలా అధిక ఫీజులు కట్టించుకుంటూ విద్యార్థుల తల్లిదండ్రులను దోపిడీ చేస్తున్నారు. అధిక ఫీజుల విషయమై విద్యార్థులు తల్లిదండ్రులు ప్రశ్నిస్తే తమ వద్ద ఇంతే అందుకు ఇష్టమైతే చేర్పించండి లేకుంటే వెళ్లిపోండి అంటూ దురుసుగా సమాధానం చెబుతున్నారు. ఒక పాఠశాలలో అయితే డొనేషన్ ఫీజే రూ.పది వేల చొప్పున వసూలు చేస్తున్నారు. ఒక్కో స్కూల్లో ఒక్కోరకంగా ఫీజులు వసూలు చేస్తున్నారని చెబుతున్నారు. మండలంలో ఏ ప్రయివేట్ పాఠశాలలో చూసినా ఏ తరగతికి ఎంత ఫీజు కట్టాలో అనే దానికి సంబంధించి ఫీజులు ధరల పట్టికను పాఠశాల వద్ద ప్రదర్శనలో ఉంచడం లేదు. ఒక స్కూల్‌లో అయితే ఐదో తరగతి విద్యార్థికి అన్ని ఫీజులు కలుపుకుని ఏడాదికి రూ.50 వేలు పైబడి కట్టాల్సి వస్తుందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు కావాల్సింది ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అని పేర్కొంటున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యా ప్రమాణాలు పెంచే దిశగా నూతన ప్రభుత్వం అందుకు తగ్గ చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

వేల్పుచర్ల గ్రామాభివృద్ధికి కృషి

ప్రజాశక్తి - ముసునూరు

టిడిపి అధినేత నారా చంద్రబాబు చేసిన అభివృద్ధి పనులను దృష్టిలో ఉంచుకుని తమ గ్రామాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లడానికి తాను సిద్ధంగా ఉన్నానని టిడిపి వేల్పుచర్ల గ్రామ నాయకులు గరికముక్కు నాని చెప్పారు. ఆదివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ తమ గ్రామంలో ఏమైనా సమస్యలు ఉంటే రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని చెప్పారు. తన వంతు సహాయంగా గ్రామంలో ఇప్పటివరకు విద్యార్థులకు పలు సహాయ కార్యక్రమాలు చేపట్టానని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రంలో ఫ్యాన్లు అందించానని చెప్పారు. గ్రామ ప్రముఖులతో, మండల నాయకులతో, జిల్లా, రాష్ట్ర నాయకులతో సంప్రదింపులు గ్రామంలో నందమూరి తారక రామారావు విగ్రహ ప్రతిష్ట కార్యక్రమానికి శంకుస్థాపన చేయించినట్లు తెలిపారు. ఆ విగ్రహం పెట్టేలా చర్యలు చేపట్టామని చెప్పారు. రైతులకు, విద్యార్థులకు, మహిళలకు పలు కార్యక్రమాలకు తన సహాయం ఎల్లప్పుడూ ఉంటుందని, గ్రామ ప్రజలకు ఎప్పుడూ అండగా ఉంటానని తెలిపారు.

నారాయణపురంలో టిఫిన్ చేసిన హోంమంత్రి

ప్రజాశక్తి - ఉంగుటూరు

నారాయణపురం - గణపవరం రహదారిలో కృష్ణా ఐస్ ఫ్యాక్టరీ నిర్వాహకుల్లో ఒకరైన కట్రెడ్డి వెంకన్న ఆహ్వానం మేరకు హోంమంత్రి వంగలపూడి అనిత టిఫిన్ చేసేందుకు ఫ్యాక్టరీ వద్దకు వెళ్లారు. ఈ సందర్భంగా టిడిపి జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, పార్టీ శ్రేణులు ఆమెను కలిశారు. కార్యకర్తలు, నాయకులు ఆమెతో ఫొటోలు దిగారు. అనంతరం ఆమె తాడేపల్లిగూడెం నిట్‌లో కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్లారు.

ఉపాధి హామీ పనుల సామాజిక తనిఖీ

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మండలంలోని అంకంపాలెం, హనుమంతులగూడెం, తుక్కులూరు, పల్లెర్లమూడి గ్రామాలలో 2023–24 ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఉపాధి హామీ పనుల సామాజిక తనిఖీ ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆగిరిపల్లి ఎంఇఒ సర్వేశ్వరరావు ఇండిపెండెంట్ అబ్జర్వర్‌గా హాజరయ్యారు. ఎస్ఆర్‌పి సూర్య చక్ర, డిఆర్‌పి గోవింద్, నాగభూషణం, ధనలక్ష్మి, సూర్యప్రకాష్, ఉపాధిహామీ సిబ్బంది, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

చిన్నికి కరాటం రాంబాబు పరామర్శ

ప్రజాశక్తి - పోలవరం

జనసేన మండలాధ్యక్షుడు గునపర్తి చిన్ని తీవ్ర అస్వస్థతకు గురై రాజమహేంద్రవరంలో ఓ ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. చిన్నిని జనసేన జిల్లా నాయకులు, డిసిసిబి మాజీ డైరెక్టర్ కరాటం రాంబాబు పరామర్శించారు. చిన్ని ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. రాంబాబుతో పాటు మాజీ ఎంఎల్ఎ మొడియం శ్రీనివాస్, జనసేన పోలవరం మండల నాయకులు కొణతాల ప్రసాద్, ఉపాధ్యక్షులు తెలగంశెట్టి రాంప్రసాద్, చెంచాని రత్నప్రసాద్, వారాడి సత్తిబాబు, కొయ్యలగూడెం జనసేన నాయకులు సాయి ఉన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా

కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ

ప్రజాశక్తి - భీమడోలు

బిజెపి కార్యకర్తలకు అండగా ఉంటానని కేంద్ర సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ హామీ ఇచ్చారు. ఆయన బిజెపి జిల్లా స్థాయి నాయకులు తపన చౌదరితో కలిసి భీమడోలు మండలంలో ఆదివారం నిర్వహించిన వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వీరికి బిజెపి ఉంగుటూరు నియోజకవర్గ సహ సమన్వయకర్త వెజ్జు ధర్మారావు ఆధ్వర్యంలో బిజెపి నాయకులు, కార్యకర్తలు స్వాగతం పలికారు. అనంతరం వెజ్జు ధర్మారావు కార్యాలయం వద్ద పార్టీ కార్యకర్తలతో వారు సమావేశం అయ్యారు. వివిధ అంశాల గురించి చర్చించారు. పార్టీ స్థితిగతుల గురించి వారిని అడిగి తెలుసుకున్నారు. పార్టీ బలోపేతానికి తగు సూచనలు చేశారు.

మహిళల హామీలు అమలు చేయాలి

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

ఎన్నికల ముందు మహిళలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని టిడిపి కూటమి ప్రభుత్వాన్ని ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా కార్యదర్శి లత డిమాండ్ చేశారు. మండలంలోని దొరమామిడిలో ప్రగతిశీల మహిళా సంఘం అధ్యక్షులు వెట్టి భారతి అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన సమావేశంలో లత మాట్లాడారు. ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ఓట్లకోసం సీట్లకోసం ఎన్ని ఇబ్బందులు ఎదురైనా అవరోధాలను అధిగమించి వనరులను సృష్టించుకుని హామీలను అమలు చేస్తామని, ఇప్పుడేమో నిధుల కొరత వెంటాడుతుందని అందుకే హామీలు అమలు చేయాలంటే కష్టంగా ఉందని చెప్పడం సరికాదన్నారు. చంద్రబాబు అధికారం కోసమే హామీలు ఇచ్చారని, మహిళలపై ప్రేమతో కాదన్నారు. మద్యం వల్ల మహిళలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వం మద్యాన్ని ప్రధాన ఆర్థిక వనరుగా చేసుకోవడం సిగ్గుచేటన్నారు. మద్యాన్ని నిషేధించాలని డిమాండ్ చేశారు. మహిళా సమస్యల పరిష్కారం కోసం, కర్తవ్యాలను రుపొందించుకోవటం కోసం, జిల్లా మహిళా ఉద్యమాన్ని పటిష్టం చేయడం కోసం అక్టోబర్ నెలలో జిల్లా మహా సభలు జరుగుతాయని చెప్పారు. ఈ మహా సభలకు అన్ని తరగతుల ప్రజలు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో సహాయ కార్యదర్శి ఈమని మల్లిక, జిల్లా కోశాదికారి కారం అరుణ, జిల్లా కార్యవర్గ సభ్యులు ధర్ముల లక్ష్మి, తగరం సత్యవతి, సరియం అనిత పాల్గొన్నారు.

కళాశాల అభివృద్ధికి సహకరించాలి

ప్రజాశక్తి - చింతలపూడి

కళాశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు సహకారం అందించాలని పలువురు కోరారు. చింతలపూడి ప్రభుత్వ డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం సమావేశం ఎస్‌కె.ఫకీర్ అధ్యక్షతన కళాశాలలో ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా కళాశాల ప్రిన్సిపల్ పి.శ్రీనివాసరావు, ఎన్.నరేంద్రకుమార్ హాజరై కళాశాలకు పూర్వ విద్యార్థులు చేయాల్సిన సహాయ సహకారాలపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళాశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు సహకరించాలన్నారు. అనంతరం పూర్వ విద్యార్థుల సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా తూము నాగవిజయకుమార్, అధ్యక్షులుగా ఎండపల్లి మాజీ సర్పంచి దొడ్డే రాజశేఖర్, కార్యదర్శిగా కాశగాని శ్రీను, కోశాధికారిగా బూసి రమేష్, ఉపాధ్యక్షులుగా ఎస్‌కె.ఫకీర్, నత్త సుజాత, కనిపెడ రాజా, సహాయ కార్యదర్శులుగా పానుగంటి సత్యనారాయణ, కాండ్రేకుల ప్రియాంక, తొర్లపాటి బాబు, కమిటీ సభ్యులుగా మన్యం సత్యకుమార్, డాక్టర్ ఎ.చిట్టిబాబు, టి.అద్దంకి, కంచర్ల బుచ్చిబాబు, డి.విజయ్‌కుమార్, సరిపల్లి రమేష్, తాడేపల్లి స్కైల్యాబ్ వీరంకి నాగు, తాళం వెంకటేశ్వరరావు, టి.సురేష్ ఎన్నికయ్యారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి : ఎఐటియుసి

ప్రజాశక్తి - చింతలపూడి

కార్పొరేట్ సంస్థల సంపద పున:పంపిణీ చేసి కష్టజీవుల అభ్యున్నతికి ఖర్చు చేయాలని ఎఐటియుసి జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి తొర్లపాటి బాబు అన్నారు. స్థానిక సిపిఐ కార్యాలయంలో సెప్టెంబర్ 1, 2, 3 తేదీల్లో జరిగే ఎఐటియుసి జాతీయ సమ్మేళనాల పోస్టర్లను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తొర్లపాటి బాబు మాట్లాడుతూ కార్పొరేట్ సంస్థల సంపద పున:పంపిణీ చేసి కష్టజీవుల అభ్యున్నతికి ఖర్చు చేయాలని ఎఐటియుసి జాతీయ సమ్మేళనాల్లో ఒక ఉద్యమ స్వరూపాన్ని రూపొందిస్తారని చెప్పారు. ఈ జాతీయ సమ్మేళనాలకు దేశ వ్యాప్తంగా ఉన్న జాతీయ సమితి సభ్యులు 500 మంది ప్రతినిధులు హాజరవుతారని, సెప్టెంబర్ మూడో తేదీన వేలాది మందితో కార్మిక ప్రదర్శన ఉంటుందని తెలిపారు. ఈ ప్రదర్శనలో అన్ని రంగాల కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె.విగ్నేష్ భజంత్రీ శ్రీనివాస్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, వారికి రూ.26 వేలు వేతనం ఇవ్వాలని, పట్టణ జనాభాకు సరిపడా విధంగా కార్మికుల సంఖ్యను పెంచాలని, మున్సిపల్ కార్మికులకు ఇవ్వాల్సిన యూనిఫామ్, గ్లౌజులు, కొబ్బరి నూనె తదితర మౌలిక సౌకర్యాలు కల్పించాలని, ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇల్లు కట్టించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు వెలగాడు అనురాధ, వెలగాడు రాము, వడిత్య బాలు, బొత్స రాజేష్, శ్రీరాముల పార్వతి, శ్రీరాముల దుర్గమ్మ పాల్గొన్నారు.

గంజాయి నుంచి యువతను కాపాడాలి



ర్యాలీ నిర్వహిస్తున్న అంబుల వైష్ణవి

ప్రజాశక్తి - ముదినేపల్లి

గంజాయి, మాదకద్రవ్యాల నుంచి యువతను కాపాడుకునే బాధ్యత అందరిపై ఉందని పలువురు వక్తలు అన్నారు. ప్రముఖ వైద్యులు అంబుల మనోజ్ ఆధ్వర్యంలో గంజాయి, మాదకద్రవ్యాలను అరికట్టాలంటూ ముదినేపల్లిలో ఆదివారం ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో పలువురు వక్తలు మాట్లాడుతూ గంజాయి, మాదకద్రవ్యాల వినియోగంతో యువశక్తి నిర్వీర్యమైపోతోందన్నారు. సామాజిక సంఘ సంస్కర్తలు, అధికారులు, తల్లిదండ్రులు దీనిపై నేటి యువతరాన్ని రక్షించుకోవాలన్నారు. ఈ ర్యాలీలో ఐటిఐ ప్రిన్సిపల్ కె.సత్యనారాయణ, ఇండో సాక్సన్ కరస్పాండెంట్ ఎంజె.జార్జి, లాయర్ బంగారయ్య, అమరావతి బ్రాండ్ అంబాసిడర్ అంబుల వైష్ణవి, విద్యాంజలి ప్రిన్సిపల్ వి.కృష్ణారావు, ఉపాధ్యాయులు, పోలీసులు, డాక్టర్లు పాల్గొన్నారు.

13న మాదిగల విజయయాత్ర ర్యాలీ

ఎంఆర్‌పిఎస్ నియోజకవర్గ అధ్యక్షులు దేవరాజు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ఈ నెల 13వ తేదీన మాదిగల విజయయాత్ర ర్యాలీని జయప్రదం చేసేందుకు ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌పి, ఎంఇఎఫ్ అనుబంధ సంఘాల నాయకులందరూ కృషి చేయాలని ఎంఆర్‌పిఎస్ నూజివీడు నియోజకవర్గ అధ్యక్షులు డి.దేవరాజు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం ఆయన ప్రకటన విడుదల చేశారు. నూజివీడు నియోజకవర్గ పరిధిలోని నూజివీడు, ముసునూరు, ఆగిరిపల్లి, చాట్రాయి మండలాల నుంచి భారీ సంఖ్యలో పాల్గొనేలా చూడాలని చెప్పారు. అభినవ అంబేద్కర్, మహాజన నేత మాన్యశ్రీ మందకృష్ణ మాదిగగా గత 30 ఏళ్లుగా మాదిగ, మాదిగ ఉప సామాజిక తరగతుల ఉజ్వల భవిష్యత్తుకు సామాజిక న్యాయ సిద్ధాంతం ఎస్‌సి వర్గీకరణ లక్ష్య సాధన కోసం నిరంతరం పోరాటం చేసినట్లు చెప్పారు. ఇందుకు ఫలితంగా ఈ నెల ఒకటో తేదీన భారతదేశ అత్యున్నత న్యాయస్థానం ఎస్‌సి వర్గీకరణకు అనుకూలంగా తీర్పు ఇచ్చిందన్నారు.

పంట బోదె పూడ్చేశారు..!

పైరు ఎండిపోతోంది

కౌలు రైతుల ఆవేదన

ప్రజాశక్తి- ముదినేపల్లి

రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా కాంట్రాక్టర్ పంట బోదె పూడ్చి వేసి రోడ్డు వేశాడంటూ కౌలు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట బోదె పూడ్చి వేయడంతో వరి చేలల్లోకి చుక్క నీరు రాక పైరు ఎండిపోతుందని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులు ముదినేపల్లిలో ఆదివారం విలేకర్లతో మాట్లాడుతూ పామర్రు - దిగమర్రు 216 రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా అంబేద్కర్ నగర్ నుంచి పోలరాజు డ్రెయిన్ వరకు కిలోమీటర్ పైబడి ఉన్న పంట బోదెను కాంట్రాక్టర్ పూడ్చివేశాడన్నారు. ఈ కారణంగా గత రెండు నెలలుగా ఈ పంట బోదె ఆయకట్టు రైతులకు సాగునీరు రాక వరి పైరు ఎండిపోతుందని కౌలు రైతు పామర్తి గిర్రాజులుతో పాటు పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పంట బోదె ఆయకట్టు పరిధిలో 250 ఎకరాల పైబడి వరి సాగు చేస్తున్నట్లు చెప్పారు. చేలల్లో నీరు లేకపోవడంతో విపరీతంగా కలుపు, గడ్డి పెరిగిపోయాయని వాపోతున్నారు. సదరు కాంట్రాక్టర్ నిర్వాకం వల్లే తాము ఈ పంటను కోల్పోవాల్సిన పరిస్థితులు దాపురించాయన్నారు. పంట బోదెలోని పూడిక తీయకుంటే తాము పంట నష్టపోయి ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి తప్పదంటున్నారు. కాంట్రాక్టర్ పూడ్చివేసిన పంటబోదెను వెంటనే పునరుద్ధరించాలన్నారు. పూడ్చివేసిన పంట బొదెలోని పూడికను రెండు రోజుల్లో తొలగించకుంటే రహదారిపై రాస్తారోకో చేస్తామని హెచ్చరించారు. ఇప్పటికే వేలాది రూపాయలు సాగు కోసం పెట్టుబడులు పెట్టామన్నారు. ఉన్నతాధికారులు స్పందించి కాంట్రాక్టర్‌పై తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విషయంలో ఎంఎల్ఎ కామినేని శ్రీనివాస్ చొరవ తీసుకొని కౌలు రైతులకు న్యాయం చేయాలని కోరుతున్నారు.



కలుపు దుబ్బులను చూపిస్తున్న రైతులు

అనారోగ్యంతో డిప్యూటీ తహశీల్దార్ మృతి

ప్రజాశక్తి - కామవరపుకోట

కామవరపుకోట తహశీల్దార్ కార్యాలయంలో సివిల్ సప్లై డిప్యూటీ తహశీల్దార్‌గా పనిచేస్తున్న మహమ్మద్ మొహిద్దీన్(58) ఆదివారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన ఇటీవల నుంచి అనారోగ్యంతో బాధపడుతుండగా చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు ఏలూరులో ఓ ప్రయివేట్ ఆసుపత్రికి తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఆదివారం మతి చెందారు. ఆయనకు భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆయన మృతి పట్ల తహశీల్దార్ జి.ఎలీషా, రెవెన్యూ సిబ్బంది, పలువురు సంతాపం తెలిపారు.

పారిశుధ్య కార్మికుడు మృతి

చాట్రాయి :మండలంలోని చాట్రాయి గ్రామానికి చెందిన మంతెన ఏసోబు(56) పారిశుధ్య కార్మికునిగా తొమ్మిది సంవత్సరాల నుంచి పనిచేస్తున్నాడు. ఆయన ఆదివారం ఉదయం శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వచ్చి మృతి చెందాడు. మృతునికి భార్య, ఒక కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ నెల ఆదో తేదీన ఇదే విధంగా పారిశుధ్య కార్మికుడు యలమర్తి సాయిబాబు మృతి చెందాడు.